
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 14 । జూన్ । 2025



సోమశిలలో 38.655 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 38.655 టీఎంసీలు ఉన్నాయి. 95 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. డెల్టాకు 3,880, ఉత్తర, దక్షిణ కాలువలకు 725 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,02,600
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.9,295
3 శాతం జీఎస్టీతో	రూ.9,574
నవర (8 గ్రా)	రూ.76,592

గరిష్టం/కనిష్టం
37.0 /27.8

వాతావరణం

జిల్లాలో శనివారం అక్కడక్కడ మోస్తరు జల్లులు పడొచ్చని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 66 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే పెద్దిరెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పుంగనూరు ఎమ్మెల్యే, మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తిరుపతిలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డితో చంద్రశేఖర్ రెడ్డి పలు విషయాలపై చర్చించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

కాకాణి బెయిల్ పిటిషన్ 16కు వాయిదా

నెల్లూరు (లీగల్): మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై వాదనలు కొనసాగించడానికి ఈ నెల 16కు వాయిదా వేస్తూ నెల్లూరు 5వ అదనపు జిల్లా (ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ) కోర్టు న్యాయమూర్తి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. గోవర్ధన్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై పోలీసుల తరపున స్పెషల్ పీపీ విజయమ్మ కోర్టులో తమ వాదనలు వినిపించారు. కాకాణి తరపున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి తమ వాదనలు వినిపించారు. ఈ నేపథ్యంలో స్పెషల్ పీపీ విజయమ్మ తమ వాదనలు పూర్తి కాలేదని, మరికొన్ని వాదనలు వినిపించడానికి సమయం కావాలని కోర్టును అభ్యర్థించారు. దీంతో కోర్టు న్యాయమూర్తి సరస్వతి బెయిల్ పిటిషన్‌పై వాదనలు కొనసాగింపును సోమవారానికి వాయిదా వేశారు.

ఫారెస్ట్ బీట్ అధికారి సస్పెన్షన్



భానుతేజ

ఉదయగిరి: ఉదయగిరి అటవీ రేంజ్ పరిధిలోని శకునాలపల్లి అటవీ బీట్ అధికారి పి.భానుతేజను సస్పెండ్ చేస్తూ జిల్లా అటవీశాఖాధికారి కదిరి మహబూబ్‌బాషా ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం రేంజ్ అధికారి కుమారరాజా ఆ ఉత్తర్వు ప్రతిని భానుతేజకు అందజేశారు. శకునాలపల్లి అటవీ బీట్‌లో అక్రమంగా జామాయిల్ నరికి సొంతంగా అమ్ముకొని నగదు కాజేసిన విషయమై స్థానిక వనసంరక్షణ సమితి సభ్యులు వెలుగులోకి తీసుకొచ్చిన విషయం విదితమే. ఈ క్రమంలో జిల్లా అధికారి ఆదేశాల మేరకు రేంజ్ అధికారి విచారణ జరిపి నివేదిక ఉన్నతాధికారులకు పంపారు. దీంతో భానుతేజను సస్పెండ్ చేశారు. కొత్తపల్లి బీట్ అధికారి చిన్నపురెడ్డిని శకునాలపల్లి బీట్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.


మరొకరికి కరోనా

నెల్లూరు (అర్బన్): జిల్లాలో మరొకరికి కరోనా నిర్ధారణ అయింది. నగరానికి చెందిన 30 ఏళ్ల యువకుడు జ్వరం, జలుబు, గొంతు సమస్యలతో బాధపడుతూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లాడు. అక్కడ కరోనా పరీక్ష చేయగా శుక్రవారం కోవిడ్ నిర్ధారణ అయింది. అతనికి కూడా స్వల్ప లక్షణాలుండటంతో హోం ఐసోలేషన్‌లో ఉంచారు. ఇప్పటి వరకు జిల్లాలో 12 కరోనా కేసులు వెలుగు చూశాయి. జిల్లాలో ఎక్కడ చూసినా జ్వరాలు ఎక్కువగా ప్రబలి ఉన్నాయి. ఎక్కువ మందికి పరీక్షలు చేస్తే మరిన్ని కరోనా కేసులు నిర్ధారణ అయ్యే అవకాశం ఉంది. ఆ దిశగా వైద్యశాఖ పరీక్షలు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మైనింగ్ శాఖలో అక్రమార్కుడు

సహజ వనరులు దోచిపెడుతూ.. కాసులు పిండుకుంటున్న అధికారి

- అనుమతులతో పనిలేకుండానే విచ్చలవిడిగా మైనింగ్
- పర్మిట్లు లేకుండానే తరలివెళ్తున్న క్వార్ట్జ్ మెటల్
- పెన్నాను కుళ్లపొడుస్తున్నా పట్టించుకోని వైనం
- చెరువులు, ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ దోపిడీ



జిల్లా మైనింగ్ శాఖలో ఓ అక్రమార్కుడు 'నేనే రాజు.. నేనే మంత్రి' అనే స్థాయిలో చెలరేగిపోతున్నాడు. మట్టి నుంచి మైకా వరకు, ఇసుక నుంచి క్వార్ట్జ్ వరకు కూటమి నేతలకు దోచిపెడుతూ తన జేబులు నింపుకుంటున్నాడు. జిల్లాకు సూపర్ బాస్ కలెక్టర్ అయితే.. అంతకు మించిన అధికారాన్ని చెలాయిస్తున్నాడు. అక్రమ మైనింగ్‌కు, పర్మిట్లు లేకుండానే క్వార్ట్జ్ మెటల్‌ను విదేశాలకు తరలించేందుకు అధికార పార్టీ నేతల పట్ల విశ్వాసంగా ఉంటున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం సహజ వనరుల దోపిడీపై మీడియా ఘోషిస్తున్నా.. ధ్రుతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నాడు.

సాక్షి, టాస్క్‌ఫోర్స్: జిల్లాలో పెన్నా గర్భం ఇసుక అక్రమ తవ్వకాలతో శోకిస్తోంది. మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలతో భూతల్లి గుండెకోతకు గురవుతోంది. మైకా, క్వార్ట్జ్ మెటల్ అక్రమ మైనింగ్‌తో భూగర్భం రోదిస్తోంది. కూటమి నేతలు సహజ వనరులను దోపిడీ చేసేందుకు తమకు అనుకూలంగా ఉండేందుకు పక్క జిల్లాలో ఏడీ స్థాయి అధికారిని జిల్లాలో ఇన్‌చార్జి డీడీ సీట్లో కూర్చోబెట్టారు. దీంతో అధికార పార్టీ నేతల దోపిడీకి, అక్రమాలకు వెన్నుదన్నుగా ఉంటూ విశ్వాసం చూపిస్తూ స్వకార్యం నెరవేర్చుకుంటున్నాడు. ప్రభుత్వం ఏర్పాటుతోనే మైనింగ్ శాఖ అధికారిగా చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టారు. కానీ ఆయన కూటమి నేతల ఆజ్ఞానుసారంగా పనిచేయకపోవడంతో ఆయన్ను చిన్న కారణం చూపించి కలెక్టర్‌తో ప్రభుత్వానికి సరెండర్ చేయించారు. అప్పటి నుంచి ఆ స్థానంలోకి ఫుల్‌చార్జి అధికారిని రానివ్వకుండా ఇన్‌చార్జి పేరుతో ఈ అవినీతి అధికారిని ఆ సీట్లో కూర్చోబెట్టి కూటమి నేతలు తమ కార్యకలాపాలు సాగించుకుంటున్నారు. సైదాపురంలో గనుల లీజుల వ్యవహారంలో తాము చెప్పినట్లే తలాడిస్తాడని తిరుపతి జిల్లా మైనింగ్ శాఖలో ఏడీ స్థాయి అధికారిగా పనిచేస్తున్న ఆయన్ను తీసుకువచ్చి నెల్లూరు జిల్లా డీడీ స్థానంలో ఇన్‌చార్జిగా అధికారం కట్టబెట్టి కూర్చోబెట్టారు. గత ప్రభుత్వంలో ఆయన జిల్లా మైనింగ్ శాఖ విజిలెన్స్ వింగ్‌లో పనిచేశారు. లీజుల వ్యవహారం నుంచి అన్నింటిపై అవగాహన ఉండడంతోపాటు కూటమి నేతల కనుసన్నల్లోనే బాధ్యతలు నిర్వహించేలా ఒప్పందంతో తీసుకువచ్చి ఈ సీటులో కూర్చోబెట్టారు. అప్పటి నుంచి ఆయన కూటమి నేతల అండతో చెలరేగిపోతున్నాడు. మైనింగ్‌శాఖ కార్యాలయాన్ని కూటమి నేతల ప్రైవేట్ అడ్డాగా మార్చేశాడు.

కలెక్టర్ సారూ.. దృష్టి పెట్టండి

కూటమి ప్రభుత్వంలో జిల్లా పరిపాలనాధికారులు సైతం నేతల కనుసన్నల్లోనే పనిచేయాల్సి వస్తోంది. జిల్లాకే బాస్ అయిన కలెక్టర్ కూడా మైనింగ్ అక్రమాలు తెలిసీ మౌనంగా ఉంటున్నారు. పాలకులు వస్తుంటారు.. పోతుంటారు. అధికారులు బాధ్యతలు విస్మరిస్తే... రేపు వారి మెడకే చుట్టుకునే అవకాశాలు లేకపోలేదు. ఇప్పటికైనా మైనింగ్‌శాఖలో జరిగే అవినీతికి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్‌ను జిల్లా ప్రజానీకం కోరుతోంది.

ఇసుక దందాలో..

జిల్లాలో ఉచిత ఇసుక విధానం ముసుగులో దందా నడుస్తోంది. పెన్నానదిని అడుగడుగునా కుళ్లబొడుస్తున్నారు. అనధికారికంగా ఓపెన్ రీచ్‌ల పేరుతో భారీ యంత్రాలతో రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక దోపిడీ జరుగుతోంది. పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నా.. మీడియాలో కథనాలు వస్తున్నా.. మైనింగ్ అధికారిగా ఆ వైపే కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మైనింగ్ శాఖ అధికారిక లెక్కల ప్రకారం స్టాక్ యార్డుల్లో ఇసుక మాయం అవుతున్నా.. ఆ లెక్కలు అడిగే దిక్కులేకుండా పోయింది. పర్యావరణ నిబంధనల మేరకు జూన్ 1వ తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు పెన్నానదిలో ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. ప్రజా అవసరాల కోసమని ఎనిమిది యార్డుల్లో 2.19 లక్షల టన్నుల ఇసుక ఉంచినట్లు అధికారిక గణాంకాలు చూపిస్తున్నారు. వాస్తవంగా అందులో లక్ష టన్నుల కూడా లేదు. అధికారికంగా పెన్నానదిలో ఇసుక తవ్వకాలు ఆపేసినట్లు చెబుతున్నా.. రాత్రి వేళల్లో నది నుంచే లోడింగ్ చేస్తున్నారు. ఇవన్నీ మైనింగ్ అధికారి కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. అక్రమార్కులతో చేతులు కలిపారన్న ఆరోపణలున్నాయి..

గత ప్రభుత్వం పెనాల్టీలను బూచిగా చూపి..

జిల్లా వ్యాప్తంగా ఉన్న క్వార్ట్జ్ గనుల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలడంతో గత ప్రభుత్వం దాదాపు 30 మైన్స్‌కు రూ.250 కోట్ల వరకు పెనాల్టీలు విధించింది. ఆయా పెనాల్టీలను సాకుగా క్వార్ట్జ్ మైన్స్ యజమానులతో బేరసారాలు నడిపి వసూళ్లు చేసుకున్నాడనే ఆరోపణలున్నాయి. పాత క్వార్ట్జ్ గనులకు లీజుల పునరుద్దరణ, పర్మిట్ల రిలీజ్‌కు కూడా రూ.కోట్లల్లో చేతులు మారుతున్నాయని సమాచారం ఉంది.

గ్రావెల్ దందాకు సహకారం

జిల్లాలో గ్రావెల్ మాఫియా బరితెగించింది. కావలి, సర్వేపల్లి, నెల్లూరు రూరల్, ఉదయగిరి నియోజకవర్గాల్లో విచ్చలవిడిగా తవ్వకాలు చేస్తున్నారు. ప్రధానంగా దగదర్తి, అల్లూరు, బోగోలు, కావలి మండలాల్లో చెరువులతోపాటు ప్రభుత్వ భూముల్లో రేయింబవళ్లు వందలాది యంత్రాలు పెట్టి వందల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లతో లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను తరలిస్తున్నారు. వెంకటాచలం మండలం నాగబోట్లకండ్రికలో అయితే ఒక ఉద్యమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. ఆ అక్రమార్కులకు మైనింగ్ కార్యాలయం నుంచి పూర్తి సహకారం అందిస్తూ అందుకు నజరాలు అందుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

అనుమతులు లేకున్నా..

జిల్లాలో దాదాపు 13 కంకర క్వారీలున్నాయి. నాలుగేళ్లుగా పర్మిట్లు రిలీజ్ చేయలేదు. అయినా కంకర క్వారీలు యథేచ్ఛగా నడిపిస్తున్నారు. పర్మిట్లు లేకుండానే జిల్లాలో జరిగే అభివృద్ధి పనులకు నిత్యం వందల టిప్పర్లలో కంకర తరలివెళ్తోంది. కానీ మైనింగ్ అధికారులు క్వారీలపై ఎన్నడూ కూడా దాడులు చేసి అక్రమ రవాణాను అడ్డుకున్న ఉదంతాలు ఏడాది కాలంలో ఎక్కడా జరగలేదు.

ప్రభుత్వ ఖజానాకు చిల్లు పెట్టి..

అత్యధిక ఆదాయం వచ్చే శాఖలో మైనింగ్ ఒకటి. కానీ ఆ శాఖకు పట్టిన అవినీతి చెద ప్రభుత్వ ఖజానాకు తూట్లు పొడిచి సొంత ఆదాయం పెంచుకుంటోంది. బినామీ పేర్లతో రూ.కోట్లల్లో ఆస్తులు పెంచుకుంటున్నారు. అవినీతి భరతం పడతామంటూ బీరాలు పలికే అవినీతి నిరోధక శాఖ సైతం ఇటువంటి అవినీతి పరుల వైపు కన్నెత్తి చూడకపోవడం విచారకరం. ఈ శాఖలో పనిచేసే ఏ అధికారిపై కొన్నేళ్లుగా ఒక్క కేసు కూడా నమోదు కాలేదంటే ఏసీబీ శాఖ పనితీరును ప్రశ్నిస్తోంది.

కొనసాగుతున్న టీచర్ల బదిలీలు



ఎక్కువ సంఖ్యలో హాజరైన ఉపాధ్యాయులు

- కౌన్సెలింగ్ సెంటర్ వద్ద ఉపాధ్యాయ సంఘాలు మోహరింపు
- చిన్నచిన్న సమస్యలపై అభ్యంతరాలు
- బదిలీ ప్రక్రియకు అవాంతరాలతో జాప్యం

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుల బదిలీలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తుండడంతో ఆ ప్రాంతంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తిష్ట వేశారు. పాయింట్లు, ప్లేస్ చూపకపోవడం వంటి సమస్యలపై పోటా పోటీగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియకు తరుచూ అంతరాయం కలుగుతోంది. బదిలీ జరుగుతున్న జెడ్పీ పాఠశాలలో తగినన్ని బల్లలు, కుర్చీలు లేకపోవడంతో ఉపాధ్యాయులు వరండాల్లోనే పడిగాపులు కాస్తున్న పరిస్థితి ఉంది. బదిలీల ప్రక్రియ ప్రతి రోజూ రాత్రి పొద్దుపోయే వరకు జరుగుతుండడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. సీనియర్ అసిస్టెంట్లకు సంబంధించి క్లస్టర్ వేకెన్సీలు కేటాయించకపోవడంతో వారికి అన్యాయం జరిగిందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆర్జేడీ లింగేశ్వరరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. లాంగ్వేజ్ పండిట్లకు అన్యాయం జరుగుతుందంటూ ఎక్కువ సంఖ్యలో పండిట్లు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎల్‌పీ తెలుగు, హిందీ సబ్జెక్ట్‌లకు సంబంధించి జిల్లాలో ఉన్న 95 శాతం ఖాళీలను గూడూరు డివిజన్‌లో చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. కావలి, నెల్లూరు, ఆత్మకూరు డివిజన్లకు సంబంధించి ప్రతి మండలంలో 3 ఖాళీలను అదనంగా చూపించి న్యాయం చేయాలని కోరారు.

ఓ పక్క బదిలీలు, మరో పక్క తరగతులు

స్థానిక దర్గామిట్టలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణ గందరగోళంగా మారింది. ఒక పక్క బదిలీలు జరుగుతుండడంతో ఆప్షన్లు పెట్టుకోవాల్సిన ఉపాధ్యాయులతోపాటు ఆయా యూనియన్ నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. మరో పక్క పాఠశాలల పునః ప్రారంభం కావడంతో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. బదిలీల జరుగుతున్న నేపథ్యంలో అన్యాయం జరిగిందంటే ఉపాధ్యాయులతోపాటు యూనియన్ సంఘాల నాయకులు ఆందోళన చేస్తుండడంతో అక్కడ ఏం జరుగుతుందో ఎవరికి అర్థం కాని పరిస్థితి ఉంది.

రూ.4.50 కోట్లతో ఉడాయింపు

- పరారీలో డ్రైవర్, గుమస్తా
- జీపీఎస్ కట్ అవడంతో అనుమానించిన వ్యాపారి
- వ్యాపారి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు
- అదుపులో నలుగురు అనుమానితులు?
- రూ.కోట్లల్లో రికవరీ



మర్రిపాడు: కారులో తరలిస్తున్న రూ.4.50 కోట్లతో కొందరు ఉడాయించారు. ఈ ఘటన శుక్రవారం మర్రిపాడు సమీపంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వ్యాపారి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ఇప్పటికే నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని దాదాపు రూ.3 కోట్లకుపైగా రికవరీ చేసినట్లు సమాచారం. సేకరించిన సమాచారం మేరకు.. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త రూ.కోట్లల్లో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నాడు. ఆయన ఢిల్లీలో రూ.4.5 కోట్ల నగదును తన కారు డ్రైవర్, గుమస్తాకు ఇచ్చి చెన్నైలో అందజేయాలని సూచించారు. దీంతో కారు డ్రైవర్, గుమస్తా నగదుతో చెన్నైకు బయలుదేరారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్, కర్నూలు మీదుగా చెన్నైకు వెళ్లాల్సి ఉంది. కారుకు జీపీఎస్ ఏర్పాటు చేసి ఉండడంతో ప్రతి క్షణం కారును పర్యవేక్షిస్తున్నారు. అయితే డ్రైవర్ రూట్ మార్చేశాడు. వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు సమీపంలోని పెద్దపోలుకుంట మీదుగా మర్రిపాడు మండలం సింగనపల్లి వద్దకు వచ్చే సరికి సిగ్నల్ కట్ అయింది. దీంతో సదరు వ్యాపారి కారు డ్రైవర్‌కు, గుమస్తాకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌లో ఉండడంతో ఆయన రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారుల ద్వారా జిల్లా పోలీసులకు సమాచారం అందించారు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ నేతృత్వంలో రంగంలోకి దిగిన పోలీసులు బాట వద్ద వ్యాపారికి చెందిన కియో కారును స్వాధీనం చేసుకుని మర్రిపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. వ్యాపారి హుటాహుటిన మర్రిపాడు పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

పథకం ప్రకారమే నగదు దోపిడీ?

కారు డ్రైవర్ పథకం ప్రకారం స్నేహితులతో కలిసి నగదు కాజేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద ఎత్తున నగదును తరలిస్తున్నామని డ్రైవర్ ఎప్పటికప్పుడు తన స్నేహితులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తూ వచ్చినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. వారందరూ కలిసి నగదు కాజేసి కారును అక్కడే వదిలి పరారయ్యారు. అయితే వారికి ఈ ప్రాంతంపై అవగాహన లేకపోవడంతో ఎటు వెళ్లాలో తెలియక ఓ వ్యక్తి అనుమానాస్పద రీతిలో పోలీసులకు దొరికినట్లు సమాచారం. అతనిచ్చిన సమాచారం మేరకు మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 3 కోట్లపైగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంపై పోలీసు అధికారుల వివరణ కోరేందుకు యత్నించగా వారు అందుబాటులోకి రాలేదు. మొత్తం మీద గంటల వ్యవధిలోనే కేసును పోలీసులు చేధించినట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.

డీలర్ టు మిల్లర్

- కోవూరు అడ్డాగా చెలరేగుతున్న రేషన్ మాఫియా
- జిల్లా వ్యాప్తంగా నెలకు 9 వేల మెట్రిక్ టన్నుల అక్రమ రవాణా
- బుచ్చిరెడ్డిపాళెం, చంద్రశేఖరపురం రైస్‌మిల్లుల్లో నెలకు 2 వేల టన్నులు రీపాలిష్
- చెన్నై మార్కెట్‌తోపాటు పోర్టుల ద్వారా విదేశాలకు తరలింపు
- షాడో ఎమ్మెల్యేకు వాటాగా నెలకు రూ.10 లక్షలు
- పోలీసులు, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులకు మామూళ్లు

జిల్లా వ్యాప్తంగా జరిగే రేషన్ దందాలో కోవూరు నియోజకవర్గం మొదటి స్థానంలో నిలుస్తోంది. కోవూరు షాడో ఎమ్మెల్యే కనుసన్నల్లో రేషన్ మాఫియా చెలరేగిపోతోంది. ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రచారం చేసి, డీలర్లకు కట్టబెట్టిన పదమూడు రోజుల్లో నాలుగు చోట్ల అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాలు పట్టుబడ్డాయి. దొరకకుండా తప్పించుకున్న వాహనాలైతే లెక్కే లేదు. ఏ దుకాణం నుంచి వస్తున్నాయో తెలిసినా ఆ డీలర్‌పై 6ఏ కేసులు నమోదు చేసిన దాఖలాలు కూడా కనిపించడం లేదు. స్థానిక ఎమ్మెల్యేలు, వారి షాడోలు రేషన్ మాఫియా లీడర్లుగా వ్యవహరిస్తూ నెలవారీగా వాటాలు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులకు మామూళ్లు ఇచ్చుకోవడం అక్రమ రవాణాపై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కోవూరు నియోజకవర్గం అన్ని రకాల మాఫియాలకు అడ్డాగా మారింది. సహజ వనరుల దోపిడీ నుంచి పేదల బియ్యం వరకు షాడో ఎమ్మెల్యేల కనుసన్నలో మాఫియాగాళ్లు దోచుకుంటున్నారు. ఇసుక, గ్రావెల్, చికెన్ వేస్ట్ మాఫియాలతోపాటు బుచ్చిరెడ్డిపాళెం, చంద్రశేఖరపురం, నెల్లూరులోని శెట్టిగుంటరోడ్డు కేంద్రాలుగా రేషన్ బియ్యం మాఫియా చెలరేగిపోతుంది. ఆత్మకూరు, కోవూరు నియోజకవర్గంతోపాటు ఇతర నియోజకవర్గాల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని ఆయా ప్రాంతాల్లో ఉన్న రైస్‌మిల్లుల్లో రీపాలిష్ చేసి చెన్నై మార్కెట్‌కు తరలించి రూ.కోట్లు గడిస్తోంది. అందుకు నజరాగా మాఫియా నెలనెలా వాటాలు పంచుతున్నారు.

నెల్లూరుకు చెందిన ఓ టీడీపీ నేత కోవూరు ఎమ్మెల్యేకు కీలక అనుచరుడిగా, షాడో ఎమ్మెల్యేగా ఉంటూ రేషన్ మాఫియాకు రింగ్‌లీడర్‌గా వ్యవహరిస్తున్నాడు. స్మగ్లర్‌తోపాటు మరో ఇద్దరు కలిసి రేషన్ బియ్యం దందాకు తెరతీశారు. కోవూరుతోపాటు ఇతర నియోజకవర్గాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించేందుకు ఓ ప్రత్యేక ముఠానే తయారు చేశాడు. డీలర్లతో కుమ్మక్కై వారి నుంచి కేజీ రూ.16 వంతున కొనుగోలు చేసి బుచ్చిరెడ్డిపాళెంలోని నాగామాంబపురం విలియన్స్‌పేటలో ఉన్న ఓ రైస్ మిల్లు, కొడవలూరు మండలంలోని రాజుపాళెం, చంద్రశేఖరపురంలో ఉన్న రైస్ మిల్లులకు, నెల్లూరు సిటీలోని శెట్టిగుంటరోడ్డు రైస్ మిల్లుకు చేర్చి అక్కడ పాలిష్ పట్టించి బ్రాండెడ్ బ్యాగుల్లో ప్యాక్ చేసి తమిళనాడు మార్కెట్‌కు తరలిస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం బస్తాలు

నెలకు 2 వేల మెట్రిక్ టన్నుల వ్యాపారం

జిల్లాలో మొత్తంగా నెలకు సుమారు 9 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అక్రమ రవాణా జరుగుతుంటే.. అందులో ఒక్క కోవూరు నియోజకవర్గం నుంచి దాదాపు 2 వేల మెట్రిక్ టన్నుల బియ్యం వ్యాపారం జరుగుతుందంటే ఇక్కడి రేషన్ మాఫియా రేంజ్ అర్థం చేసుకోవచ్చు. నియోజకవర్గంతోపాటు సమీపం నియోజకవర్గాల మండలాల నుంచి సేకరించిన బియ్యాన్ని ఎప్పటికప్పుడు పాలిష్ పట్టించి రీసైక్లింగ్ చేస్తున్నారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఈ ప్రక్రియ నడుస్తోంది. ఆయా మిల్లుల్లో రేషన్ బియ్యం పాలిష్ పట్టడం తప్ప.. ధాన్యం కొనుగోలు చేసి మరపడుతున్నట్లు రికార్డుల్లేవు. ఆయా మిల్లులకు ప్రతి నెలా వేలల్లో వచ్చే కరెంట్ బిల్లులే రేషన్‌బియ్యం పాలిష్ పడుతున్నారనే దానికి అద్దం పడుతోంది.

షాడో ఎమ్మెల్యేకు నెలకు రూ.10 లక్షలు

రేషన్ మాఫియా నెలకు రూ.కోట్లల్లో సంపాదిస్తుంటే.. షాడో ఎమ్మెల్యేకు నెలకు రూ.10 లక్షల వాటాలుగా ఇస్తున్నారనే సమాచారం. ఇక పోలీసులు, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ, విజిలెన్స్ అధికారులకు మామూళ్లు ఇచ్చుకుంటూ పోతుండడంతో ఎవరిపైనా చర్యలు తీసుకుంటున్న దాఖలు కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇటీవల పట్టుబడిన రేషన్ బియ్యం

- జలదంకి మండలం చామదలకు చెందిన డీలర్లు వెంకటసుబ్బారెడ్డి, వెంకట్రామిరెడ్డి దుకాణాల నుంచి గత మంగళవారం అర్ధరాత్రి 11 బస్తాల బియ్యం అక్రమంగా తరలిస్తుండగా స్థానికుల సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. ఇక్కడ జరిగిన అసలు ట్విస్ట్ ఏమిటంటే.. మరో లారీలో భారీగా రేషన్ బియ్యాన్ని ఇంకో రూట్లో తరలించడమే.
- కొడవలూరు మండలం చంద్రశేఖర్‌పురం వద్ద లక్ష్మీ నరసింహస్వామి రైస్‌మిల్లులో వారం రోజుల కిందట రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తుండగా పౌరసరఫరా శాఖ డీటీ సారంగపాణి పట్టుకున్నారు. 32 టన్నుల రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి చెన్నై మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

సంగం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంతోపాటు వాహనాన్ని శుక్రవారం సంగం వద్ద పోలీసులు పట్టుకున్నారు. నెల్లూరు– ముంబై జాతీయ రహదారిపై వాహనంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో వాహనాన్ని సంగం పోలీసులు వెంబడించారు. బుచ్చి టోల్ ప్లాజా మధ్యలో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సుమారు రెండున్నర టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. చేజర్ల మండలం నాగులవెల్లటూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం సమీపంలో ఉన్న ఓ రైస్‌మిల్లుకు తరలిస్తున్నట్లు సమాచారం. దీనిపై పూర్తి విచారణ చేపట్టి దోషులను గుర్తిస్తామని పోలీసులు తెలిపారు.



పోలీస్ స్టేషన్‌లో రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం

ఆర్థిక సమస్యలతో..

- వ్యక్తి బలవన్మరణం

సీతారామపురం: మండలంలోని రంగనాయుడుపల్లి గ్రామ ఎస్టీ కాలనీకి చెందిన సవరం చిన్నలక్ష్మయ్య (35) ఆర్థిక సమస్యలతో శుక్రవారం మద్యంలో పురుగు మందు కలిపి తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. లక్ష్మయ్యకు వివాహమై ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. ఆర్థిక సమస్యలు చుట్టుముట్టిన తరుణంలో లక్ష్మయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో పూటుగా మద్యంలో పురుగు మందు కలిపి తాగి ఇంటి ముందు పడిపోవడంతో కుటుంబ సభ్యులు ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బాధిత కుటుంబానికి అప్పగించారు.

వరాలతల్లి వెంగమాంబ

రేపటి నుంచి 19 వరకు బ్రహ్మోత్సవాలు

- ఏర్పాట్లు చేస్తున్న వ్యవస్థాపక ధర్మకర్తల మండలి, అధికారులు
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు
- ప్రత్యేక బస్సులు నడపనున్న ఆర్టీసీ



దుత్తలూరు: భక్తుల కొంగు బంగారంగా.. పతిభక్తికి ప్రతిరూపంగా.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా.. వరాల తల్లిగా విరాజిల్లుతున్న దుత్తలూరు మండలంలోని నర్రవాడలో కొలువైన ప్రసిద్ధ వెంగమాంబ బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు జరుగుతాయి. ఏటా జ్యేష్ఠమాసం పౌర్ణమి తర్వాత వచ్చే ఆదివారం నుంచి గురువారం వరకు ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. దీనికి ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివస్తారు. జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు వలస వెళ్లిన వారు పెద్ద ఎత్తున రానున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల మండలి, దేవదాయ శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్యక్రమాలిలా..

15న జరిగే నిలుపు కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. అదేరోజు సంతానం లేని మహిళలు అమ్మవారి ముందు వరపడతారు. 16న గ్రామోత్సవం, 17న గ్రామోత్సవం, 18న పగలు కల్యాణోత్సవం, పసుపు, కుంకుమ ఉత్సవం, రాత్రికి ప్రతానోత్సవంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. చివరిరోజైన 19వ తేదీ పొంగళ్లు పెట్టడం, ఎడ్ల బండలాగుడు పోటీలు జరుగుతాయి. ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఏటా పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఆర్టీసీ సైతం ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు పెడుతున్నారు.

అమ్మ దయ ఉంటే..

వలసవాసుల ఆరాధ్యదైవంగా వెంగమాంబకు పేరుంది. అమ్మవారి నగదును తమ వ్యాపారాల్లో పెట్టుబడిగా పెడితే అధిక లాభాలు వస్తాయనేది ప్రగాఢ నమ్మకం. దీంతో నగదు కోసం పోటీపడుతుంటారు. పలు జిల్లాలు, రాష్ట్రాల్లో వెంగమాంబ పేరుతోనే హోటళ్లు, వ్యాపార సంస్థలు నిర్వహిస్తుంటారు.



ప్రత్యేకలంకరణలో వెంగమాంబ దంపతులు

ఏర్పాట్లు చేస్తున్నాం



వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముంది. వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. వైద్య సదుపాయం కల్పిస్తాం. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకొని ఉత్సవాలు విజయవంతం చేస్తాం.

– వెట్టిగుంట ఉషశ్రీ, ఆలయ ఈఓ

సంప్రదాయం ప్రకారమే ఉత్సవాలు



గతం నుంచి వస్తున్న ఆచారాల ప్రకారమే అమ్మవారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కల్యాణం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తాం. ప్రతి కార్యక్రమం ఆమె పుట్టినిల్లయిన వడ్డిపాళెంలోని రేణుకా ఎల్లమ్మ గుడినుంచే ప్రారంభమవుతాయి. భక్తులకు అమ్మవారి కరుణా కటాక్షాలు ఉండాలని ప్రార్థిస్తున్నాం.

– బెల్లంకొండ పెదభద్రయ్య, సురేష్, ఆలయ అర్చకులు

మోటార్‌బైక్‌ను తప్పించబోయి..

- ఆటో బోల్తా పడి మహిళా కూలీ మృతి
- ఆరుగురికి గాయాలు



ఘటనా స్థలంలో ఆటో

వెంకటాచలం: ఎదురుగా వచ్చిన మోటార్‌బైక్‌ను తప్పించబోయి ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. ఆరుగురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన వెంకటాచలం మండలం తిక్కవరప్పాడు పంచాయతీ మల్లుగుంటసంఘం వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఇడిమేపల్లి పంచాయతీ పలుకూరువారిపాళెం గ్రామానికి చెందిన పలువురు వ్యవసాయ కూలీలు వరినాట్లు వేసేందుకు ఆటోలో జోసఫ్‌పేటకు బయలుదేరారు. ఆటో మల్లిగుంటసంఘానికి చేరుకోగానే బైక్ ఎదురుగా అడ్డు వచ్చింది. ఆటో డ్రైవర్ బైక్‌ను తప్పించబోయాడు. ఈ క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడి పడింది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న మల్లి లక్ష్మీదేవమ్మ (55)తోపాటు, మరో ఆరుగురు మహిళలు గాయపడ్డారు. స్థానికులు వెంటనే ట్రాక్టర్‌లో సర్వేపల్లిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. లక్ష్మీదేవమ్మకు తీవ్ర రక్తగాయాలు కావడంతో మృతిచెందింది. గాయాలపాలైన మహిళలు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. లక్ష్మీదేవమ్మ మృతిచెందిందనే విషయం తెలియడంతో ఆమె భర్త తిరుపాలు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సర్వేపల్లికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాతులు మేపేందుకు చిన్నారుల కిడ్నాప్

- మహిళను అరెస్ట్ చేసిన పోలీసులు



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్): బాతులు మేపేందుకు ఇద్దరు చిన్నారులను కిడ్నాప్ చేసిన మహిళను నెల్లూరు నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డి కేసు పూర్వాపరాలను వెల్లడించారు. నెల్లూరు రూరల్ మండలం కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన కె.శీనమ్మ, కృష్ణ దంపతులకు తొమ్మిదేళ్ల కుమార్తె చంద్రమ్మ, కుమారుడు సూర్య అనే పిల్లలున్నారు. ఈనెల 8వ తేదీన శీనమ్మ తన ఇద్దరు పిల్లలను తీసుకుని మైపాడు బీచ్‌కు వెళ్లింది. మధ్యాహ్నం వరకు అక్కడ ఉండి తిరిగి నెల్లూరుకు చేరుకున్నారు. శెట్టిగుంటరోడ్డు వద్ద ఆటో కోసం వేచి ఉండగా చిన్నారులు అదృశ్యమయ్యారు. బాధిత తల్లి గాలించగా జాడ తెలియకపోవడంతో నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా చిన్నారులను తీసుకెళ్లింది కావలికి మండలం చలంచర్ల గ్రామానికి చెందిన పి.జాలమ్మగా గుర్తించారు. శుక్రవారం కావలి జేబీ కాలేజ్‌గేటు వద్ద ఆమెను అదుపులోకి తీసుకుని చిన్నారులను సంరక్షించారు. అనంతరం ఆమెను స్టేషన్‌కు తరలించి విచారించగా బాతులు మేపేందుకు చిన్నారులను తీసుకెళ్లినట్లు అంగీకరించడంతో అరెస్ట్ చేశారు. చిన్నారులను బాధిత తల్లిదండ్రులకు అప్పగించారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్, ఎస్సై రెహమాన్, సిబ్బంది బీవీ నరసయ్య, ఎన్.ప్రసాద్, ఆర్వీ రత్నయ్య, టి.మస్తాన్‌రావు, ఎం.వేణు, జి.మస్తానయ్య, ఎస్‌కే గౌస్‌బాషాలను ఎస్పీ అభినందించారు.

400 ర్యాపిడ్ కిట్లు మాత్రమే వచ్చాయ్

నెల్లూరు(అర్బన్): కరోనా కేసులు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నప్పటికీ ఇంతకాలం జిల్లా వైద్యారోగ్య శాఖకు ర్యాపిడ్ కిట్లు ప్రభుత్వం పంపించలేదు. ఎట్టకేలకు కేవలం 400 కోవిడ్ ర్యాపిడ్ కిట్లను శుక్రవారం జిల్లా వైద్యశాఖకు పంపింది. 52 పీహెచ్‌సీలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, పది సీహెచ్‌సీలున్నాయి. వీటిని ఎలా పంపిణీ చేయాలో వైద్యశాఖ అధికారులకు అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటి వరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మాత్రమే కరోనా పరీక్షలు జరిగేవి.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మనుబోలు: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ముప్పవరపు మల్లికార్జున (40) విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతను మద్యానికి బానిసయ్యాడు. ఒంటరిగా ఉంటున్నాడు. శుక్రవారం వేకువజామున ఇంట్లో అపస్మారక స్థితిలో ఉన్న మల్లికార్జునను స్థానికులు గుర్తించారు. అప్పటికే చనిపోయి ఉన్నాడు. అయితే శరీరంపై అక్కడక్కడ గాయాలున్నాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్థానికులు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు వారించడంతో విరమించుకున్నారు.

హేచరీ యాజమాన్యంపై కేసు

- బాల కార్మికుడికి గాయాలవడంతోనే..



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, లేబర్ ఇన్‌స్పెక్టర్

ఉలవపాడు: హేచరీలో పనిచేస్తున్న బాల కార్మికుడికి గాయాలవడంతో యాజమాన్యంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. అనకాపల్లి జిల్లా వయకరంపల్లి మండలం ఈదటం గ్రామానికి చెందిన ఓ బాలుడు పదో తరగతి చదువుతున్నాడు. అతడి స్నేహితుడు నాగేష్ ఉలవపాడు మండల పరిధిలోని అలగాయపాళెం వద్ద ఉన్న శ్రీనివాస హేచరీలో పనిచేస్తున్నాడు. అతడితోపాటు సెలవుల్లో పని చేయడానికి బాలుడు మే 3వ తేదీన వచ్చాడు. 27వ తేదీన రొయ్య పిల్లలు పెంచే ట్యాంక్‌లు శుభ్రం చేసి యాసిడ్ బకెట్‌తో నిచ్చెన దిగుతున్న సమయంలో బాలుడు కింద పడ్డాడు. తలకు బలమైన గాయమైంది. బకెట్‌లో ఉన్న యాసిడ్ కళ్లలో పడి మంటలు రావడంతో యాజమాన్యం కందుకూరులోని పంటవారిపాళెంలో చూపించి ఇంటికి పంపించింది. తల్లిదండ్రులు బాలుడిని తుని హాస్పిటల్లో చూపించగా ఆపరేషన్ చేయాలని చెప్పారు. తుని వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా లేబర్ ఇన్‌స్పెక్టర్ సుజాత, ఎస్సై అంకమ్మ వెళ్లి ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. 18 ఏళ్లలోపు బాలుడిని పనిలో పెట్టుకున్నందుకు హేచరీ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. ఇంకా ఎవరైనా బాల కార్మికులు ఉన్నారా అని తనిఖీ చేశారు.

జనారణ్యంలోకి జింక



సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని కచేరిదేవరాయపల్లి గ్రామానికి శుక్రవారం జింక వచ్చింది. స్థానికుల కథనం మేరకు.. తాగునీటి కోసం అటవీ ప్రాంతం నుంచి జింక గ్రామంలోకి వచ్చింది. గ్రామస్తులు చూసి అది కుక్కల బారిన పడకుండా కాపాడారు. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులకు సమాచా రం అందించారు. అటవీ శాఖాధికారి శ్రీను మాట్లాడుతూ జింకను కొత్తపల్లి అటవీ ప్రాంతంలో వదిలేశామన్నారు. ఆయన వెంట బీట్ ఆఫీసర్లు చెంచురాములు, ప్రసాద్ ఉన్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలోలలో)	
పెద్దవి:	రూ.37
సన్నవి:	రూ.25
పండ్లు:	రూ.10

